అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 21 । జనవరి । 2025



రోడ్డుపై భారీ పాము

వై.రామవరం: కోకితగొంది సమీపంలో సుమారు పది అడుగుల పాము సోమవారం ఆటోలో వెళ్తున్న ప్రయాణికులకు కనిపించింది.



అప్పన్న సన్నిధిలో...

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని లలితాపీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి దర్శించుకున్నారు.



అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.

పాడేరు ఐటీడీఏ పీవో బదిలీ

పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా నియామకం



వి.అభిషేక్



కె.ధీరజ్



జగదీష్

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌కు బదిలీ అయింది. ఆయనను పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్(ఎల్‌ఏ అండ్ ఆర్‌ఆర్)గా ప్రభుత్వం నియమించింది. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వి.అభిషేక్ పాడేరు సబ్‌కలెక్టర్‌గా, పాడేరు ఐటీడీఏ పీవోగా గత మూడేళ్ల నుంచి సేవలు అందిస్తున్నారు.ఐటీడీఏ పీవో అభిషేక్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

ఇద్దరు ఐపీఎస్‌లకు స్థాన చలనం

రాష్ట్ర వ్యాప్త ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా జిల్లాలో ఇద్దరు ఏఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేయడంతో పాటు ఇదే జిల్లాలో నియమించింది.రంపచోడవరంలో ఏఎస్పీగా పనిచేస్తున్న 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కె.ధీరజ్‌ను అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా బదిలీ చేసింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆయన పాడేరు ఏఎస్పీగా పనిచేశారు. అలాగే ప్రస్తుతం పాడేరు ఏఎస్పీగా పనిచేస్తున్న 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన జగదీష్‌ని ఇదే జిల్లాలోని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్‌కు బదిలీ చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే చిన్నారుల మరణాలు

- వాంగెడ్డ కొత్తూరులో చిన్నారుల వరుస మరణాలపై విచారణ చేపట్టాలి
- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: మండలంలోని వాంగెడ్డ కొత్తూరులో వారం రోజుల వ్యవధిలోనే ముగ్గురు చిన్నారులు మరణించడానికి ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ముగ్గురు చిన్నారులు వారంరోజుల వ్యవధిలో వివిధ కారణాలతో చనిపోయిన విషయం తెలుసుకున్న ఆయన సోమవారం వాంగెడ్డ కొత్తూరు వెళ్లి అక్కడ బాధిత కుటుంబాలతో మాట్లాడారు. చిన్నారుల మృతికి గల కారణాలను అడిగి తెలుకున్నారు. అనారోగ్యానికి గురైన తమ పిల్లలను చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి సకాలంలో తీసుకువెళ్లినా అక్కడ సరైన చికిత్స అందలేదని బాధితులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ చిన్నారుల మృతిపై విచారణ జరపాలని కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు ఫిర్యాదు చేశారు. బాధ్యులైన అధికారులు,సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ సభ్యులు బాలయ్య, మాజీ వైస్‌ఎంపీపీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్‌నాయకులు గంగన్నపడాల్ ఎంపీటీసీలు మీనాకుమారి, జయలక్ష్మి, సర్పంచ్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పాపం.. పసుపు రైతు

పసుపు రైతు అనాథగా మారాడు. ఇటు జీసీసీ కొనుగోలు చేయదు... అటు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోదు. దీంతో మద్దతు ధర దక్కక విలవిలలాడుతున్నాడు. పెట్టుబడులు పెరుగుతున్నా.. గిట్టుబాటు ధర రాకపోవడంతో కష్టమే మిగులుతోందని రైతులు వాపోతున్నారు.



- కొనుగోలు చేయని జీసీసీ
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- దళారుల చెప్పిందే రేటు
- కనీస మద్దతు ధర దక్కని వైనం
- ఈ ఏడాదైనా రేటు లభించేనా
- గంపెడాశతో సేకరణ ప్రారంభం



కరకపుట్టు ప్రాంతంలో పసుపు పంటను సేకరిస్తున్న గిరిజన మహిళలు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఆరు గాలం కష్టపడి పసుపు పండించే రైతులకు సరైన ధర లభించడం లేదు. ఖర్చుతో కూడినదైనా ఎన్నో ఏళ్లుగా జిల్లాలోని పలువురు రైతులు పసుపు సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. పంట సాగుకు, సోకే తెగుళ్ల నుంచి కాపాడుకునేందుకు ఎకరానికి సుమారు రూ.50 వరకు ఖర్చు చేస్తున్నారు. గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేసే నాణ్యమైన పసుపునకు జాతీయ స్థాయిలో అధిక డిమాండ్ ఉంది. రెండేళ్లకు ఒకసారి పసుపు పంటను తవ్వి సేకరించే రైతులకు మాత్రం గిట్టుబాటు ధరలు కల్పనలో పాలకులు,అధికారులు విఫలమవుతున్నారు. పసుపు వ్యాపారమంతా దళారుల కనుసన్నల్లో నడుస్తోంది. గిరిజన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన జీసీసీ కూడా పసుపు కొనుగోలుకు దూరంగానే ఉంది. దీంతో కష్టపడి పసుపు సాగుచేసిన గిరిజన రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వారపుసంతల్లో వ్యాపారుల చెప్పిన ధరకే అమ్ముకోవలసి వస్తోంది. గత ఏడాది ఇదే సమయంలో కిలో రూ.80 ధరతో పసుపు కొనుగోలును వ్యాపారులు ప్రారంభించారు. చివరిలో ఏప్రిల్‌లో కిలో రూ.110 ధరను గిరిజన రైతులకు చెల్లించారు. వ్యాపారులు మాత్రం జాతీయ మార్కెట్‌లో కిలో రూ.180 ధరతో అమ్మకాలు జరిపి మంచి లాభాలు పొందారు. ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

జీసీసీ ద్వారా కొనుగోలుకు చర్యలు

జీసీసీ ద్వారా పసుపు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. గత నెలలోనే జీసీసీ ఎండీకి పసుపు ధరలకు సంబంధించి నివేదిక ఇచ్చాం. మళ్లీ మరోసారి జీసీసీ యాజమాన్యంతో చర్చించి పసుపునకు గిట్టుబాటు ధర కల్పన, సంతల్లో మార్కెటింగ్‌కు చర్యలు తీసుకుంటాం.

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు

వ్యాపారులు సిండికేట్

పసుపును ప్రైవేట్ వ్యాపారులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో వారంతా సిండికేట్‌గా మారి కొనుగోలు ధరను తగ్గించేస్తున్నారు. ఈఏడాది కిలో రూ.100ధరతో కొనుగోలు ప్రారంభించారు. నాణ్యత, తేమవంటి వ్యత్యాసాలను చూపి ధరలను తగ్గించేస్తున్నారు. జీసీసీ ద్వారా పసుపును కిలో రూ.150తో ప్రభుత్వం కొనుగోలు చేయించాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

కిలో రూ.150 ధరతో కొనుగోలుకు డిమాండ్

జాతీయ మార్కెట్‌లో మన్యం పసుపునకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో కిలో రూ.150ధరతో వ్యాపారులు కొనుగోలు చేయాలని గిరిజన రైతులు డిమాండ్ చేస్తున్నారు.గత ఏడాది కూడా వ్యాపారులు తక్కువ ధరతోనే కొనడంతో జనవరి, ఫిబ్రవరి నెలల్లో అమ్ముకున్న గిరిజన రైతులు భారీగా నష్టపోయారు.ప్రస్తుతం పసుపు అమ్మకాల సీజన్ ప్రారంభం కావడంతో అధిక ధర లభిస్తుందన్న గిరిజన రైతులు తమ పసుపును మార్కెటింగ్‌కు సిద్ధం చేస్తున్నారు.

పసుపు సేకరణలో గిరిజన రైతులు బిజీ

ఈఏడాది గంపెడాశతో గిరిజన రైతులు పసుపు విక్రయానికి సిద్ధమయ్యారు.పసుపు పంట తవ్వకం,సేకరణ,గ్రామాలకు తరలింపు,ఉడకబెట్టడం,వెనువెంటనే ఆరబెట్టడం వంటి పనుల్లో బిజీగా మారారు. పసుపు కొమ్ములను బాగా ఆరబెట్టిన తరువాత రంగు వచ్చేంతవరకు నిర్వహించే నేలరాసే పనులు ఎంతో కష్టంతో కూడుకున్నవి.పాడేరు డివిజన్ వ్యాప్తంగా 25వేల ఎకరాల్లో పసుపు పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకి సుమారు వెయ్యి కిలోల వరకు ఎండు పసుపు తయారవుతుందని జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు 'సాక్షి'కి తెలిపారు.గత ఏడాది ఎకరానికి రూ.70 వేల నుంచి రూ.80వేల వరకు ఆదాయం వచ్చినప్పటికి గిట్టుబాటు కాలేదని గిరిజన రైతులు వాపోతున్నారు.



వర్షాలతో తగ్గిన దిగుబడి

ఏడాది అధికంగా కురిసిన వర్షాల వల్ల పసుపు దిగుబడి తగ్గింది. సాధారణంగా ఎకరాకు వెయ్యి కిలోల దిగుబడి వస్తుంది. కానీ ఈ సంవత్సరం వర్షాలు, చీడపీడల కారణంగా ఎకరాకు రెండు వందల నుంచి మూడు వందల కిలోల వరకూ దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. కొమ్ము సైజు కూడా తగ్గడంతో దానిని సాకుగా చూపి దళారులు ధర తగ్గించేస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది నష్టపోయాను



రెండేళ్ల పాటు కష్టపడి సాగుచేసిన పసుపునకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాం.గత సీజన్ ప్రారంభంలో కిలో రూ.80తో అమ్ముకుని నష్టపోయాను. ఆర ఎకరం పంటను విక్రయిస్తే కేవలం రూ.30వేలు వచ్చింది. ఈఏడాది దిగుబడులు తగ్గిన పరిస్థితుల్లో కిలో రూ.150తో వ్యాపారం జరగని పక్షంలో ఆర్థికంగా నష్టపోతాం

–గొల్లూరి ముకుందు,పసుపు రైతు, వంతాలగుమ్మి గ్రామం, పాడేరు మండలం

ప్రభుత్వం కొనుగోలు చేయాలి



ఏజెన్సీలో సాగైన పసుపును ప్రభుత్వం కొనుగోలు చేయాలి.జీసీసీ,మార్క్‌ఫెడ్,స్పైసెస్ బోర్డులు ఉన్నప్పటికీ గిరిజన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం అన్యాయం.ఈ ఏడాది కూడా పసుపునకు జాతీయ మార్కెట్‌లలో డిమాండ్ ఉన్నందున ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

– ఉల్లి పోతురాజు, గిరిజన రైతు, గసబా గ్రామం,పెదబయలు మండలం

వంతాలగుమ్మిలో ఎండిన పసుపును అమ్మకానికి సిద్ధం చేస్తున్న గిరిజన మహిళ



వంతాలగుమ్మిలో పసుపును ఉడకబెడుతున్న గిరిజనులు

సకాలంలో అర్జీలకు పరిష్కారం

సబ్ కలెక్టర్ కల్పశ్రీ



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో స్వీకరించిన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ వారం 65 అర్జీలు స్వీకరించినట్టు చెప్పారు. సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

- రాజవొమ్మంగి మండలం గడుఓకుర్తి పంచాయతీలోని దోనిలపాడు, దాటిగుమ్మి కాలువ నుంచి దొర చెరువు వరకు నీటిని మళ్లించాలని గడుఓకుర్తి సర్పంచ్ నవిరాల చంద్రుడు అర్జీ అందజేశారు.
- అడ్డతీగల మండలం దుర్చర్తి పంచాయతీ డి.పోలవరంపాడులో నివసిస్తున్న కొందు గిరిజనులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు వర్తింప చేయాలని పంగి సన్యాసి రావు, వంతల శ్రీను, వంతల ఈశ్వరరావు దరఖాస్తు చేశారు.
- రంపచోడవరం మండలం సీమగండి నుంచి ధారగూడెం వరకు కిలోమీటరు బీటీ రోడ్డు, దారగూడెం నుంచి సోకులగూడెం వెళ్లే మెయిన్ రోడ్డు వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మించాలని నెర్రం అబ్బులు, వలల సోమరాజు దరఖాస్తు అందజేశారు.

ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయ శాంతి, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఐ.శ్రీనివాసరావు,సుబ్బయ్య, రవికుమార్, డీఎల్డీవో కోటేశ్వరరావు, తహసీల్దార్ పి.రామకృష్ణ, ఎంపీడీవో ఎస్. శ్రీనివాసరావు దొర, సీడీపీవో సంధ్యారాణి, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీధర్,స్వామి, రవీంద్రబాబు, త్రిమూర్తులు,పీహెచ్‌వో చిట్టిబాబు, ఏడీఏలు కె.సావిత్రి, సీహెచ్.కె.వి. చౌదరి, ఉపాధి హామీ పథకం ఏపీడీ జి.శ్రీనివాస రావు, వెలుగు ఏపీడీ దేగలయ్య, ఏఎస్‌వో విజయ భాస్కర్, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామ తులసి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సహకారంతోనే గంజాయి నిర్మూలన

ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా



మాట్లాడుతున్న చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

గూడెంకొత్తవీధి: గిరిజనుల సంపూర్ణ సహకారంతోనే గంజాయి నిర్మూలన సాధ్యమవుతుందని చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా అన్నారు. ఇటీవల బాధ్యతల స్వీకరించిన ఆయన గూడెంకొత్తవీధి పోలీస్ స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. స్థానిక సీఐ వరప్రసాద్, ఎస్ఐ అప్పలసూరి ఆధ్వర్యంలో గిరిజనులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఆంధ్రా,ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు అధికంగా ఉండేవని, గిరిజనుల్లో మార్పు రావడం వల్లే ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయాయని చెప్పారు. గంజాయి సమూలంగా నిర్మూలన కావాలంటే గిరిజనుల సహకారం తప్పని సరి అని చెప్పారు. గిరిజనులకు ఏకష్టమొచ్చినా పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. సమస్యలేవైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్ దరఖాస్తులకు తుది గడువు నేడు

అరకులోయటౌన్: పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోడానికి గడువు ఈనెల 21వ తేదీ(మంగళవారం)తో ముగియనుందని స్థానిక ప్రభుత్వ ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ,పాలిటెక్నిక్, 10వతరగతి నుంచి పీజీ, బీ ఫార్మసీ చేసిన రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఆన్‌లైన్, దూర విద్యనభ్యసిస్తున్న అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.5వేలు స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. అభ్యర్థులు ఆర్‌ఐటీఐలో ఈనెల21వ తేదీ స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

కిల్లోగుడ పీహెచ్‌సీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

దుంబ్రిగుడ: మండలంలోని సొవ్వా పంచాయతీ కమలబంద గ్రామానికి చెందిన నిండు గర్భిణి పాంగి సువానికి శనివారం రాత్రి వైద్య సేవలు అందించడం, అంబులెన్స్ సమకూర్చడంలో నిర్లక్ష్యం వహించిన కిల్లోగుడ పీహెచ్‌సీలో నలుగురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు వైద్యాధికారి నజీబ్ తెలిపారు. స్టాఫ్‌నర్స్, ఎఫ్ఎన్‌వో, అంబులెన్స్ డ్రైవర్, ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్‌లకు డీఎంహెచ్‌వో జమాల్ బాషా ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. ఈవిషయంపై పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తుది నిర్ణయం తీసుకుంటారని ఆయన తెలిపారు.

కిల్లోగుడ పీహెచ్‌సీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

సాగర ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుల డిమాండ్



కిల్లోగుడ ఆరోగ్య కేంద్రంలో వైద్యధికారితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దుంబ్రిగుడ: సొవ్వా పంచాయతీ కమలబంధ గ్రామానికి చెందిన నిండు గర్భిణి వంత సువానికి వైద్య సేవలందించడం, అంబులెన్స్ సమకూర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కిల్లోగుడ పీహెచ్‌సీ సిబ్బందిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సాగర ఎంపీటీసీ వంతల దేవదాసు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బాకా సింహాచలం, పి.అశోక్ డిమాండ్ చేశారు. కిల్లోగుడ పీహెచ్‌సీలో శనివారం రాత్రి నిండు గర్భిణి సువాని నరకయాతనకు గురైన ఘటనపై పూర్తి స్థాయిలో ఆరా తీశారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారితో మాట్లాడుతూ గిరిజనులకు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రసవం కోసం వస్తే కరెంట్ లేదన్న సాకుతో పంపేయడం ఎంతవరకూ సమంజసమని నిలదీశారు. 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న అంబులెన్స్‌ను ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. మళ్లీ ఇటువంటి పరిస్థితులు పురావృత్తం కాకుండా చూడాలన్నారు.


పకడ్బందీగా దివ్యాంగ పెన్షనర్ల ధ్రువీకరణ

జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ

పాడేరు రూరల్: జిల్లా వ్యాప్తంగా దివ్యాంగ పెన్షర్ల వైకల్యంపై పకడ్బందీగా ధ్రువీకరణ పక్రియ నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె.డాక్టర్ అభిషేక్‌గౌడ ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నుంచి వైద్యఆరోగ్య శాఖ, పంచాయతీ అధికారులతో సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి పాడేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, అరకులోయ, రంపచోడవరం ఏరియా ఆస్పత్రుల్లో దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. జిల్లాలో 8,582 మంది దివ్యాంగులున్నారని, ప్రతి రోజు 70 మందికి పరీక్షలు నిర్వహించి, అంగవైకల్యాన్ని నమోదు చేయాలన్నారు. ఈపక్రియ నిర్వహణకు ఎనిమిది వైద్య బృందాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వమిత్ర, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతదేవి,డాక్టర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సుజనకోట గంగమ్మతల్లి ఆలయం వద్ద కురుస్తున్న మంచు

తగ్గుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



చింతపల్లిలో కురుస్తున్న మంచు

చింతపల్లి: జిల్లాలో రెండు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. చలి,మంచు తీవ్రత అధికంగా ఉంది. సోమవారం జి.మాడుగులలో 5.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణం విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శనివారం నుంచి జిల్లా వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు బాగా తగ్గి చలి తీవ్రత పెరిగింది. పాడేరు డివిజన్ పరిధిలో జీకే వీధిలో 5.5 డిగ్రీలు,పెదబయలులో 5.8 డిగ్రీలు,దుంబ్రిగుడలో 6.0 డిగ్రీలు, పాడేరులో 6.1 డిగ్రీలు,అరకులోయలో 6.8 డిగ్రీలు,చింతపల్లిలో 7.3 డిగ్రీలు,ముంచంగిపుట్టులో 7.8 డిగ్రీలు,హుకుంపేటలో 8.3 డిగ్రీలు,అనంతగిరిలో 9.0 డిగ్రీలు, కొయ్యూరులో 12.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలునమోదైనట్టు ఏడీఆర్ తెలిపారు.ఉదయం 10 గంటల వరకూ మంచు అధికంగా కురవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని ప్రయాణించవలసి వచ్చింది.

కమ్మేసిన పొగమంచు ..

ముంచంగిపుట్టు: మత్స్యగెడ్డ పరీవాహక ప్రాంతాల్లో పొగమంచు కమ్మేస్తోంది.ఉదయం 10గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మంచుతో పాటు చలి తీవ్రత అధికమవడంతో సరిహద్దు గ్రామాల ప్రజలు గజగజ వణుకుతున్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట


ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న సర్పంచ్ పార్తిమ్మ, భక్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ గుర్రాలబయలు గ్రామ సమీపంలోని గుంజిరిసంతా వద్ద సోమవారం ఏర్పాటుచేసి న ఆంజనేయస్వామి విగ్రహాన్ని సర్పంచ్ డి.పార్తిమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు జె.వి.వి.ఎస్.మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు పద్మారావు తదితరులు ప్రతిష్టించారు. గురుస్వామి సాయిరాం ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సద్గురు సేవ ఆశ్రమము నుంచి లక్ష రూపాయలు ఆర్థిక సహాయంతో ఆంజనేయ విగ్రహం ఏర్పాటు చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ధనుర్జయ్, రామారావు, కేశవరావు, దామోదరం, దొన్ను తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం


అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

అడ్డతీగల: అడ్డతీగలలోని పుడిగి మాణిక్యం కుటుంబానికి చెందిన తాటాకిల్లు షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నికి ఆహుతైంది. సోమవారం జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాధిత కుటుంబీకులు మాణిక్యం, గౌరీదేవి కూలీ పనులకు వెళ్లారు. వీరి ముగ్గురు పిల్లల ఇంట్లోనే ఉన్నారు. విద్యుత్ మీటర్ నుంచి ఒక్కసారిగా మంటలు చేలరేగడాన్ని గమనించిన చిన్నారులు భయంతో బయటకు పరుగులు తీశారు. విషయాన్ని గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఇల్లు మొత్తం అగ్నికి ఆహుతైంది. ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం మంటల్లో కాలిబూడిదవడంతో బాధిత కుటుంబం కట్టుబట్టలతో వీధిన పడ్డారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు మాణిక్యం, గౌరీదేవి దంపతులు కోరుతున్నారు.

ఆటో బోల్తా పడి పలువురికి గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో


గాయపడిన గిరిజనులు

గూడెంకొత్తవీధి: మండలంలోని ముల్లుమెట్ట గ్రామం వద్ద సోమవారం మధ్యాహ్నం ఓ ఆటో అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాజంగి నుంచి ఒడిశాకు ఒకే కుటుంబానికి చెందిన కొంతమంది వెళ్తుండగా ముల్లుమెట్ట వద్ద మలుపులో ఆటో అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108లో చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

మనసును కట్టేస్తున్న జనుము

- ఎకరాకు రూ.40 వేల ఆదాయం
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి
- సీడ్స్‌తో ఆయుర్వేద ఆయిల్
- జిల్లాలో సాగుపై రైతుల ఆసక్తి
- రబీలో 10 వేల ఎకరాల్లో పంట

పచ్చని పైరులో పసుపు సోయగంతో ఆకట్టుకునే కట్టె జనుము పంట రైతులకు సిరులు కురిపించడమే కాదు.. నేలను సారవంతం చేస్తోంది. దీని విత్తనాలతో తయారైన ఆయిల్‌తో ఆయుర్వేదంలో మోకాళ్ల నొప్పులకు వినియోగిస్తున్నారు. ఇన్ని ప్రయోజనాలున్న ఈ పంటపై జిల్లా రైతులు ఆసక్తి చూపించడమే కాదు.. విస్తారంగా సాగు చేస్తున్నారు.


బుచ్చెయ్యపేటలో కట్టె జనుము పంట..


జనుము విత్తనాలు

సాక్షి, అనకాపల్లి: ఖరీఫ్ వరి పంటలో వరుసగా వస్తున్న నష్టాలు.. రబీ అపరాల పంటలకు చీడ పురుగుల బెడద.. వెరసి తీవ్రనష్టాలను మూటగట్టుకుంటున్న జిల్లా రైతులకు కట్టె జనుము లాభదాయకంగా మారింది. పైసా పెట్టుబడి లేకుండా.. ఎటువంటి ఎరువులు వాడకుండా, రూ.వేల లాభాన్ని ఆర్జించి పెడుతుంది. గ్రామాల్లో ఎటు చూసినా పసుపు పచ్చగా.. ఆకర్షణీయంగా కనిపించే జనుము పంట జిల్లాలో వివిధ మండలాల్లో 10 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రబీ సీజన్‌లో నువ్వులు, అపరాలతో పాటు ఈ పంట వేస్తుంటారు. కట్టె జనుము ప్యాబేసీ కుటుంబానికి చెందిన ఈ మొక్క పంట వల్ల భూసారం పెరుగుతుంది. రబీలో వేసిన ఈ పంట ఖరీఫ్ సీజన్ నాటికి భూమికి నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు అందిస్తుంది. ఈ పంటను ప్రస్తుతం ఓ వైపు విత్తనాభివృద్ధికి, మరోవైపు ఆయుర్వేదంలో ఉపయోగపడే హెంప్ ఆయిల్ కింద వినియోగిస్తున్నారు.

భూసారం పెంచుకోవచ్చు

మార్కెట్‌లో ధర బాగుండటంతో, ఎలాంటి పెట్టుబడి లేకుండానే లాభాలను పొందే అస్కారం ఉంది. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోయి చౌడు శాతం పెరిగిపోతోంది. పంటల సాగుకు పనికి రాకుండా పోతోంది. ఎంత పెట్టుబడి పెట్టినా, దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పచ్చిరొట్ట పంటలను పెంచి నేలలో కలియదున్నడం ద్వారా భూసారం పెంచుకోవచ్చు.

కిలో విత్తనాల ధర రూ.80

ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడి రావడం, కిలో రూ.80 ధర పలుకుతుంది. ఎకరాకు రూ.40 వేల వరకు ఆదాయం వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే కట్టె జనుము సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మోకాలు నొప్పి తగ్గేందుకు..

కట్టెజనుము గింజలు పచ్చిరొట్ట ఎరువుకు ఎంత ఉపయోగమో ఆయుర్వేదంలో మోకాలు నొప్పి తగ్గేందుకు కూడా హెంప్ ఆయిల్‌గా తయారు చేసి వినియోగిస్తున్నారు. అందువల్లే ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో కట్టె జనుము సాగుకకు గ్లోబల్ ఇండికేషన్‌గా గుర్తింపు పొందే పరిస్థితి తీసుకువచ్చింది. ఇక్కడ నుంచి ఒడిశాకు ఎగుమతి అవుతున్నాయి.

ఒడిశాకు ఎగుమతి..

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం జిల్లాలో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా తర్వాత అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా పండిస్తున్నారు. ఈ విత్తనాలను ఇక్కడ నుంచి ఒడిశా రాష్ట్రానికి ఎగుమతి చేస్తున్నారు.

చీడపీడల ప్రభావంతో కట్టె జనుము సాగుపై ఆసక్తి..

రబీ సీజన్‌లో జిల్లాలో ఎక్కువగా నువ్వులు, అపరాల పంటలు వేస్తుంటారు. వీటికి చీడపీడలు బెడద ఎక్కువ కావడం, పెట్టుబడి అధికం కావడంతో కట్టె జనుము సాగుపై వైపు రైతులు మళ్లతున్నారు. పొలం గట్లపైనా సాగు చేస్తుంటారు.

సాగు లాభదాయకం..

కట్టెజనుము సాగు రైతుకు లాభదాయకంగా ఉంది. రబీ సీజన్‌లో జిల్లాలో ఎక్కువగా నువ్వులు పంట వేస్తున్నారు. వాటి తర్వాత పెసర, మినుప, పిల్లి పెసర, బొబ్బరి వంటి అపరాల పంట వేస్తున్నారు. ఈ పంటల కంటే ఎక్కువ ఆదాయం వస్తోండటంతో రైతులు కట్టె జనుము సాగువైపు దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో పాటు అధిక ఆదాయం ఆర్జించే అవకాశాలున్నాయి. అంతేకాకుండా ఈ పంటతో భూసారవంతం పెరుగుతోంది.

– డాక్టర్ మోహన్‌రావు, అగ్రికల్చర్ జేడీ

రోగులకు ప్రత్యేక శ్రద్ధతో వైద్య సేవలు అందించాలి

- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


వెల్‌నెస్ ఓపీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరు: రోగులకు ప్రత్యేక శ్రద్ధతో వైద్య సేవలు అందించాలని పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరావు తెలిపారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో వెల్‌నెస్ ఓపీ, ప్రివెంటివ్ ఆంకాలజీ కేంద్రాలను ఆయన సోమవారం ప్రారంభించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి జిల్లా ఆస్పత్రికి వచ్చే గిరిజనులకు ప్రత్యేక శ్రద్ధతో అవసరమైన వైద్య సేవలు అందించలన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు అవసరమై సేవలు అందించడానికి, బ్రెస్ట్ ఓరల్ సర్వికల్ క్యాన్సర్‌ను గుర్తించడానికి ప్రివెంటివ్ ఆంకాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో గిరిజనులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, వైద్యాధికారులు టి.నరసింగరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాంబాబు, సర్పంచ్‌లు చిట్టిబాబు,బసవన్నదొర, ఎంపీటీసీ సభ్యులు నరసింహమూర్తి, రామకృష్ణపాత్రుడు, నాయకులు సూర్యనారాయణ,ఊర్వశి రాణి,వెంకటేశ్వర్లు, రమణ,సత్యనారయణ,రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వంజంగి ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు మహిళలకు గాయాలు
- జిల్లా ఆస్పత్రిలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పరామర్శ
- తన వాహనంలో బాధితులను ఇళ్లకు తరలింపు


గాయపడిన మహిళలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : పర్యాటక ప్రాంతమైన వంజంగి ఘాట్‌లో స్కూటీ అదుపుతప్పి పడడంతో ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. చింతపల్లి మండలం పాత కిన్నెర్ల గ్రామానికి చెందిన గత ప్రభుత్వంలో గ్రామ వలంటీర్‌గా పని చేసిన సంధ్యతో పాటు మరో ఇద్దరు మహిళలు సౌజన్య, జెనిస్సా కలిసి స్కూటీపై వంజంగి ఘాట్ అందాలను తిలకించేందుకు వచ్చారు. మార్గమధ్యంలో స్కూటీ అదుపు తప్పడంతో పడిపోయారు. దీంతో వీరు స్థానిక జిల్లా ఆస్పత్రికి చేరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు జిల్లా ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. దగ్గరుండి వైద్య చికిత్సలను పర్యవేక్షించారు. అనంతరం వారిని ఎమ్మెల్యే తన సొంత వాహనంలో వారి స్వగ్రామం పాత కిన్నెర్లకు తరలించారు.

రహదారి నిబంధనలు పాటించాలి


రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్

ముంచంగిపుట్టు : వాహన చోదకులు విధిగా రహదారి నిబంధనలు పాటించాలని జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్ అన్నారు.రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రం ముంచంగిపుట్టులో సోమవారం మోటర్ వాహనాల ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా రవాణాధికారి మాట్లాడుతూ మోటర్ వాహన చట్టం 1988 ప్రకారం రహదారి భద్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

'సమావేశాలకు రాకుండా సమస్యలు ఎలా పరిష్కరిస్తారు'

సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆగ్రహం


మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: మండల సర్వసభ్య సమావేశాలకు రాని అధికారులు గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోరాబు అనూషాదేవి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశానికి గైర్హాజరైన మండల స్థాయి అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలకు రాని అధికారులపై కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. మండలంలోని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వారి పంచాయతీల్లోని సమస్యలను సమావేశంలో వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, వైస్ ఎంపీపీలు గోపీనాయక్ శారద, వెంగళరావు. ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం

సబ్ కలెక్టర్ అభిషేక్ గౌడ


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌గౌడ

పాడేరు రూరల్: కుష్ఠు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించాలని పాడేరు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ తెలిపారు. కుష్ఠు వ్యాధిపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత సిబ్బంది గ్రామాల్లో సమగ్ర సర్వే చేసి, వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరించాలని తెలిపారు. వారికి అవసరమైన వైద్యం అందించలన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు,కాళ్లు, చేతులు తిమ్మిర్లు కలిగి ఉండడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించకపోవడం వంటి లక్షణలు ఉండే వారి వివరాలను వైద్య సిబ్బంది సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ జమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్ష

అనకాపల్లి: గంజాయి కేసులో శారదానగర్‌కు చెందిన బొంది రమేష్‌కు జిల్లా పదో అదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య ఐదేళ్ల జైలు శిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం తెలిపారు. 2021 జూన్ 28న శారదానది బ్రిడ్జి వద్ద రెండు కేజీల గంజాయితో రమేష్ పట్టుబడ్డాడు. అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా, వాదోవాదాలు అనంతరం న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

ప్రయాణికులకు తప్పని పాట్లు

- సకాలంలో రాని బస్సులు
- గంటల కొద్దీ నిరీక్షణ


బస్సు ఎక్కేందుకు తోపులాడుతున్న ప్రయాణికులు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో సోమవారం సకాలంలో బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక బస్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు నిరీక్షించాల్సి వచ్చింది.అనంతరం వచ్చిన బస్సులో ఎక్కేందుకు ప్రయాణికులు తోపులాడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గిరిజన ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లేందుకు బస్సు సర్వీసులు తక్కువగా ఉండడంతో వేళకు రాకపోవడంపై పలువురు ప్రయాణికులు ప్రభుత్వ పనితీరుపై విమర్శించారు. ఆర్టీసీ అధికారులు సక్రమంగా వేళకు బస్సులు నడపకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా సకాలంలో బస్సులు నడిపేందుకు ఆర్టీసీ ఉన్నాతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మోదమ్మకు ప్రత్యేక పూజలు


మోదమ్మకు పూజలు చేస్తున్న తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదేవత మోదకొండమ్మ తల్లిని రాష్ట్ర తూర్పు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ సోమవారం దర్శించుకున్నారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ కమిటీ ప్రతినిధులంతా ఆయనకు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించి, మోదకొండమ్మ తల్లి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. పాడేరు కాపు సంక్షేమ సంఘం నేత ధర్మారావు, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్


కలెక్టర్ దినేష్‌కుమార్‌కు మొక్కను అందజేస్తున్న ఎస్‌డీసీ లోకేశ్వరరావు

సాక్షి,పాడేరు: కలెక్టర్ దినేష్‌కుమార్‌ను పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.ఎ స్.లోకేశ్వరరావు సోమవారం మ ర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలులో ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న లోకేశ్వరరావును ఎస్‌డీసీ (గిరిజన సంక్షేమశాఖ) ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని ముళియగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సోమ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని, నాణ్యమైన పౌష్టికాహారం ఆహారం అందించాలని , ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు.

పాఠశాల విద్యలో మార్పులపై సమీక్ష

విశాఖ విద్య : పాఠశాల విద్యలో తీసుకొస్తున్న సమూల మార్పులపై ఆ శాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఏయూలో సోమవారం జరిగిన వర్క్‌షాప్‌నకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, విజయకృష్ణన్, దినేష్ కుమార్, అంబేడ్కర్‌తో పాటు ఆర్జేడీ విజయ భాస్కర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా మోడల్ స్కూళ్ల ఏర్పాట్లు, క్లస్టర్ విధానం అమలు, యూపీ స్కూళ్లను సమీప హైస్కూళ్లలో విలీనానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో అవగాహన కల్పించేలా వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. ఈ వర్క్‌షాప్ వివరాలను అత్యంత గోప్యత పాటించటం గమనార్హం.

ఐక్యతకు చిహ్నం.. దేశ నాయకుల తీర్థాలు


పాల సొసైటీ వద్ద ఉన్న అల్లూరి విగ్రహం


పండింట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం


గాంధీ వీధిలోని జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహం


ప్రధాన కూడలిలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం


కాలనీలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం

- ఆదర్శంగా నిలుస్తున్న కె.జె.పురం గ్రామస్తులు
- దేశ నాయకుల విగ్రహాలకు ప్రతి ఏటా తీర్థాలు
- గ్రామంలో వీధులకు సైతం నాయకుల పేర్లు

మాడుగుల రూరల్: మేజర్ పంచాయతీ కె.జె.పురం గ్రామస్తులు, యువకులు తమ ఐక్యతను చాటుకుంటున్నారు. గ్రామంలో దేశ నాయకుల తీర్థాలు ఏటా నిర్వహిస్తూ తమ దేశభక్తిని ప్రదర్శిస్తున్నారు. దేవతామూర్తులు, అమ్మవార్లకు తీర్థాలు నిర్వహించడం ఆనవాయితీ. సంక్రాంతి పండగ నుంచి గ్రామాల్లో తీర్థాల సందడి ఉంటుంది. అయితే కె.జె.పురంలో అమ్మవార్లు, దేవతామూర్తులతో పాటు దేశ నాయకుల విగ్రహాలకు ప్రతి ఏటా తీర్థాలు నిర్వహిస్తున్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, దివంగత ప్రధాని పండింట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఆజాద్ సుభాష్ చంద్రబోస్, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, తదితర నేతల విగ్రహాలను గ్రామంలో ప్రతిష్టించారు.

అలాగే ఆ నాయకుల పేరుతో వీధులకు నామకరణం కూడా చేశారు. గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను గ్రామ తొలి సర్పంచ్ దివంగత పాలకుర్తి శ్రీరామమూర్తి 1957 సంవత్సరంలో విజయవాడ నుంచి తీసుకొచ్చి ప్రతిష్టించారు. అప్పటి నుంచి ఈ విగ్రహాలకు తీర్థాలు నిర్వహించడం ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని గ్రామానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి అతికంశెట్టి సింహాచలం తయారు చేయించి పాల సొసైటీ వద్ద ప్రతిష్టించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ముకుందపురం మాజీ సర్పంచ్ కర్రి శ్రీరామమూర్తి సహకారంతో కాలనీలో ఏర్పాటు చేశారు.

- గాంధీ తీర్థం ప్రతి ఏటా ఆయన వర్ధంతి మరుసటి రోజు జనవరి 31న గాంధీ వీధి ప్రజలు నిర్వహిస్తుంటారు.
- సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 23న స్థానిక నేతాజీ సోల్జర్స్ యూత్ సారథ్యంలో తీర్థం నిర్వహించనున్నారు.
- నెహ్రూ తీర్థం ప్రతి ఏటా ఫిబ్రవరి 8న నెహ్రూ వీధిలో నిర్వహించనున్నారు.
- గ్రామంలో అంబేడ్కర్ జయంతిని ఏప్రిల్ 14న పండగలా నిర్వహించి, పలు క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తుంటారు.
- అల్లూరి సీతారామరాజు జయంతి జూలై 4న జరుపుతారు. వీరితో పాటు దివంగత మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల జయంతి, వర్ధంతులను కూడా నిర్వహిస్తున్నారు.


ఆ ఘనత శ్రీరామమూర్తిదే



దివంగత మాజీ సర్పంచ్ పాలకుర్తి శ్రీరామమూర్తి కృషితో దేశ నాయకుల విగ్రహాలను గ్రామంలో 1957లో ప్రతిష్టించాం. అప్పటి నుంచి దేశ నాయకుల తీర్థాలు నిర్వహించడం కె.జె.పురంలో ఆనవాయితీగా వస్తోంది. తీర్థాలు, జయంతి, వర్ధంతి కార్యక్రమాలను గ్రామస్తులంతా ఐకమత్యంతో నిర్వహిస్తున్నాం.

– పుట్టా వెంకట రామ అప్పారావు, కె.జె.పురం, మాడుగుల మండలం

వీధుల పేర్లు బాగున్నాయి..



చిన్నప్పటి నుంచి దేశ నాయకుల విగ్రహాలకు తీర్థాలు నిర్వహించడం చూస్తున్నా. వీధులకు నాయకుల పేర్లు పెట్టారు. పిలవడానికి చాలా బాటుంటుంది. పోస్టల్ అడ్రస్‌లో గాంధీ వీధి, నెహ్రూ వీధి అన్న పేర్లతో పిలుస్తున్నారు. పాలకుర్తి శ్రీరామమూర్తి కృషితో ఇదంతా జరిగింది.

– కచ్చా వెంకటరమణ, కె.జె.పురం, మాడుగుల మండలం